విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

రామంతాపూర్: అరవింద్‌నగర్‌లోని విశ్వశాంతి హైస్కూల్ వార్షిక క్రీడోత్సవాలను అదనపు డీసీపీ నర్సయ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కనబరిచి, మంచి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. మాజీ ఏసీపీ అశోక చక్రవర్తి, స్కూల్ డైరెక్టర్ వెంకటేశం, ప్రిన్సిపాల్ రూపారాణి తదితరులు పాల్గొన్నారు.

బాక్స్ కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

రామంతాపూర్ : భగాయత్ వెంకట్ సాయినగర్ కాలనీ మూసీ నాలాలపై బాక్స్ కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజయేందర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ జెడ్సీ హేమంత్ కేశవ్‌పటేల్‌కు వినతిపత్రం అందజేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. స్థానికులు ఇంటికి చేరాలంటే 2 కిలోమీటర్ల మేర నడిచి వెళ్లాల్సి వస్తుందని, దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనిపై జెడ్సీ సానుకూలంగా స్పందించి నిర్ణయం తీసుకుని, తగిన చర్యలు తీసుకుంటారని అభిప్రాయపడ్డారు. కాలనీవాసులు గోవింద్, శ్రీనివాస్, అశోక్, నవీన్, ఐలేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

మౌలాలి: హనుమాన్‌నగర్‌లో మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీతాశేఖర్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను ఏఈ మధురిమతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గత 6 నెలలు క్రితం నిధులు మంజూరయ్యాయని, పనుల్లో జాప్యం చేయడం సరికాదని అధికారులకు సూచించారు. బాక్సు డ్రైనేజీ పనులు కూడా వెంటనే ప్రారంభించాలన్నారు. అధికారులు అజయ్, మనీషా, నరేందర్, అశోక్, శశికళ, రాజు, డివిజన్ అధ్యక్షుడు శివగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, నటరాజ్ పాల్గొన్నారు.

పరిశ్రమలకు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేస్తాం

మల్లాపూర్: వేసవిలో పరిశ్రమలకు నిరంతరంగా విద్యుత్‌ను సరఫరా చేస్తామని హబ్సిగూడ డీఈ సుబ్బరావు అన్నారు. శనివారం ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం నాచారం ఇండస్ట్రియల్ అసోసియేషన్ కార్యాలయంలో నాచారం విద్యుత్ సబ్‌స్టేషన్ ఏడీఈ దశరథ్ అధ్యక్షతన విద్యుత్ సమస్యలు, ప్రత్యేక కార్యాచరణ, సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై పారిశ్రామిక యజమానులతో సమావేశం నిర్వహించారు. విద్యుత్ అంతరాయం కాకుండా ట్రాన్స్‌ఫార్మర్లు కెపాసిటీ, కొత్త విద్యుత్‌లైన్లు, ఏబీస్విచ్‌లను అమర్చనున్నట్లు పేర్కొన్నారు. హబ్సిగూడ విద్యుత్ సబ్‌స్టేషన్ టోల్ ఫ్రీ నెంబర్ 9440813935, ఎఫ్ఓసీ హబ్సిగూడ 949053524, నాచారం 9490153525 నంబర్లకు ఫిర్యాదు చేసి సమస్యలు తెలపాలన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై సీఐటీయూ నిరసన

కుషాయిగూడ: పార్లమెంట్‌లో ఆర్థికమంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల వ్యతిరేక బడ్జెట్ అని సీఐటీయూ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ఈసీఐఎల్ చౌరస్తాలో బడ్జెట్ పత్రాలను తగలబెట్టారు. పెరుగుతున్న నిరుద్యోగం, కార్మికుల సంక్షేమంపై ఎలాంటి కేటాయింపులు లేకపోవడం బాధకరమన్నారు. సీఐటీయూ ఉపాధ్యక్షుడు గణేష్, సహాయ కార్యదర్శి రాజశేఖర్, కొండల్‌రెడ్డి, శివ, శ్రీనివాస్, శ్రీధర్, శ్రీనివాసచారి, పద్మ, లలిత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పీర్జాదిగూడ-పర్వతాపూర్ వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులను శనివారం మాజీ మేయర్ అమర్‌సింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులు పూర్తయితే పీర్జాదిగూడ పర్వతాపూర్ మధ్య నిత్యం ఎదురయ్యే ట్రాఫిక్ సమస్యలు తొలగిపోతాయన్నారు. స్థానిక సీనియర్ నాయకుడు బొడిగె కృష్ణగౌడ్, యాసారం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై సమీక్ష సమావేశం

గౌతంనగర్: గౌతంనగర్‌లోని విద్యుత్ ఏడీఈ కార్యాలయంలో విద్యుత్ ఏడీఈ చంద్రశేఖర్, అధికారులు, వినియోగదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో వినియోగదారులకు ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా 'సమ్మర్ యాక్షన్ ప్లాన్' కింద పనిచేసేందుకు మల్కాజిగిరి సబ్ డివిజన్‌కు రూ.4 కోట్లు ప్రభుత్వం నుంచి బడ్జెట్ కేటాయించామన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని మిర్జాలగూడ, వసంతపురి, మల్కాజిగిరి, వినాయక్‌నగర్ సెక్షన్ల పరిధిలో పనులు జరుగుతున్నాయన్నారు. విద్యుత్ సమస్యలు రాకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు తదితర పనులు చేపట్టామని స్పష్టం చేశారు. వినియోగదారులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.

అల్పాహారం షురూ !

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదోతరగతి విద్యార్థులకు అల్పాహారం (స్నాక్స్) శనివారం నుంచి ప్రారంభించారు. మార్చి 21 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచడానికి రోజూ పాఠశాల ముగిసిన తర్వాత ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నారు. వారికి పౌష్టికాహారం అందేలా అల్పాహారాన్ని ఈనెల 1వ తేదీ నుంచి మార్చి 20 వరకు అందజేయనున్నారు.



అల్పాహారం తీసుకుంటున్న విద్యార్థులు

మల్కాజిగిరి: మండల పరిధిలో 5 జిల్లా పరిషత్ హైస్కూళ్లు, మౌలాలి ప్రభుత్వ పాఠశాల, తెలంగాణ మైనారిటీ రెసిడెన్సీ పాఠశాల విద్యార్థినుల్లో 417 మంది ఉన్నారు. అల్వాల్ మండల పరిధిలో 6 జిల్లా పరిషత్ పాఠశాలల్లో 328 మంది విద్యార్థులు పరీక్షలకు మొత్తం 745 మంది సిద్ధమవుతున్నారు. వీరికి ప్రతిరోజూ పాఠశాల ఆవరణలో ఉదయం 8 నుంచి 9 వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు జరుగుతున్నాయి. సాయంత్రం వేళల్లో విద్యార్థులకు అల్పాహారం అందజేస్తారు.

ఆదివారం అన్ని రోజుల్లో..

6 రోజులకు 6 రకాలుగా వివిధ రకాల అల్పాహారాన్ని విద్యార్థులకు అందజేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఉడికించిన పెసలు, బొబ్బర్లు, శనగలు, పల్లీలు, బెల్లం, మిల్లెట్ బిస్కెట్స్, ఉల్లి పకోడి అందజేస్తారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకే..

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాట్లు చూసే నిర్వాహకులకే అప్పగించారు. ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రోజుకు రూ. 15 కేటాయించారు. ఇప్పటికే అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచనలు జారీ చేశామని మల్కాజిగిరి మండల విద్యాధికారి సురేష్, అల్వాల్ మండల విద్యాధికారి జ్యోతిరెడ్డిలు స్పష్టం చేశారు.

విద్యార్థులకు ఉపయోగకరం



పోషక విలువలు ఉన్న పెసలు, బొబ్బర్లు, శనగలు, పల్లీలు, బెల్లం, చిరుధాన్యాల బిస్కెట్లు అందజేయడం వలన వారికి ఎంతో ఉపయోగకరం. ముఖ్యంగా ఉడకబెట్టిన వాటిలో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. విద్యార్థులకు వాటిని అందజేయడం వలన జీర్ణక్రియ బాగా ఉండటం, చురుకుదనం ఉండట, రక్తహీనత తగ్గిపోవడం, శరీరంలో వేడి తక్కువ కావడం, ఎముకలకు బలం చేకూరుడం లాంటి ఎన్నో లాభాలు ఉన్నాయి.

– డాక్టర్ శ్రీనివాస్

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధి మిర్జాలగూడలోని వేంకటేశ్వర దేవాలయం నుంచి దర్గా వరకు రూ.17లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి, త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె అధికారులకు సూచించారు. ఏఈ దివ్యజ్యోతి, బీఆర్ఎస్ నేతలు మేకల రాముయాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జలమండలి అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని 7 జేపీసీ కాలనీల్లో డ్రైన్ ఔట్‌లెట్ సమస్యపై శనివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి జలమండలి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మచ్చబొల్లారం డివిజన్ పరిధి శ్రీనివాసకాలనీ, గంగా ఎవెన్యూ, ఎంఈఎస్ కాలనీ, ఎంహెచ్ఆర్ కాలనీ, కాశీపురం, శాన్విప్రైడ్ విల్లాస్, గ్రీన్‌ల్యాండ్స్ ఎన్‌క్లేవ్‌లలో సమస్యాత్మకంగా మారిన డ్రైన్ ఔట్‌లెట్ సమస్యను పరిష్కరించేలా ప్రణాళిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాలని సూచించారు. జలమండలి జీఎం సునీల్, డీజీఎం సాంబయ్య, మేనేజర్ సంజయ్, బీఆర్ఎస్ నేతలు డోలి రమేష్, జీకె.హన్మంతరావు, అమీనుద్దీన్, భాగ్యనందరావు, ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

'లక్ష డప్పులు వేయి గొంతులు' పోస్టర్ ఆవిష్కరణ

మేడిపల్లి: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 7న నిర్వహించే 'లక్ష డప్పులు వేయి గొంతులు' సభ పోస్టర్‌ను మేడిపల్లిలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ మాదిగ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మంద కృష్ణ మాదిగ 30 ఏళ్లుగా నిస్వార్థంగా సామాజిక న్యాయంకోసం మాదిగ, ఉపకులాల హక్కుల కోసం వర్గీకరణ లక్ష్యంగా ఉద్యమించారన్నారు. 7న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్దఎత్తున ప్రతి ఒక్కరూ డప్పుతో రావాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ మేడిపల్లి మండల అధ్యక్షుడు బండారి సాయి మాదిగ, బోడుప్పల్ కార్పొరేషన్ అధ్యక్షుడు శివ, శ్రీకాంత్, నవీన్, వీరమల్లు, వెంకటేష్, రాజు, రోహిత్, అజయ్, శివ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

కేంద్ర బడ్జెట్‌పై భిన్న స్వరాలు

కాప్రా/అల్వాల్ /మౌలాలి : లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై పలువురి నుంచి భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎనిమిదోసారి ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులను మెప్పించేలా ఉందంటే.. మరికొందరు విద్యార్థులను నిరాశపర్చిందని మరికొందరు అభిప్రాయ పడుతున్నారు.

దేశమంటే కొన్ని రాష్ట్రాలే అన్నట్లు బడ్జెట్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025–2026 బడ్జెట్ చాలా నిరాశపరిచింది. కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ చెబుతూ తెలంగాణ రాష్ట్రంపై వివక్ష చూపుతోంది. తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్రమంత్రులు, బీజేపీ ఎంపీలు ఉండి కూడా ఏం సాధించారోనని ఆలోచించుకోవాలి.

– మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

ఇది నిజంగా పేదల బడ్జెట్

దేశంలో ఎక్కువ శాతం ఉన్న మధ్యతరగతి వాళ్లకి ఇది నిజంగా శుభవార్త. రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను లేకపోవడం మధ్యతరగతి ప్రాధాన్యతను గుర్తించారు. యువతకు ఉద్యోగ కల్పన, సంక్షేమ పథకాల కోసం బడ్జెట్ కేటాయింపులు అన్ని వర్గాల అభివృద్ధికి తోడ్పడుతుంది.

– గున్నాల సునీతా శేఖర్ యాదవ్, మౌలాలి కార్పొరేటర్

విద్యారంగం కేటాయింపుల్లో నిరాశ

గత బడ్జెట్ కంటే విద్యకు కేటాయింపులు 7శాతం మేర తగ్గించారు. విద్యకు ప్రాధాన్యం ఇస్తేనే దేశాభివృద్ధి సాధ్యం. ఉన్నత విద్యాసంస్థలకు కేటాయింపులు ఇంకా పెంచాల్సి ఉండాల్సింది. సాంకేతిక విద్యను అభ్యసించిన విద్యారులు నైపుణ్యాలను పెంపొందించుకునేలా సంబంధిత కంపెనీలు, సంస్థల్లో ఉచిత శిక్షణ అందించాలి.

ప్రొఫెసర్ కుమారస్వామి.

గురజాడ సూక్తికి అనుగుణంగా బడ్జెట్

బడ్జెట్ సామాన్యులు, మధ్యతరగతికి ఉపయోగపడేలా ఉంది. రూ. 12 లక్షల వరకు ట్యాక్స్ మినహాయింపు ఇవ్వడం మధ్యతరగతికి భారీ ఉపశమనం లభించినట్లైంది. పెట్టుబడిదారీ వ్యవస్థను ఆకర్షించేలా కాకుండా సామాన్యుల బడ్జెట్‌గా ఉంది.

– నాగిరెడ్డి సంజీవరెడ్డి, వ్యాపారవేత్త

ఉద్యోగులకు వరం లాంటిదే..

బడ్జెట్ ఉద్యోగులకు ఓ గొప్ప వరం లాంటిది. ఆదాయపన్నుల స్లాబ్ రూ.12 లక్షల వరకు ట్యాక్స్ లేకపోవడంతో మధ్యతరగతికి మేలు చేసింది. 36 రకాల ఔషధాలకు పన్ను విధించకుండా అందించాలనే నిర్ణయం చాలా మంచిది.

– రాజేశ్వర్‌గుప్తా, సామాజికవేత్త

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ బెల్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.30 వరకు ఐడీఏ మల్లాపూర్, సపాలలైన్ ఏరియాలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు మల్లాపూర్ విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు.

నాచారంలో..

నాచారం 33/11 కేవీ నాచారం సబ్‌స్టేషన్ 11 కేవీ గురు రాఘవేంద్ర, 11 కేవీ గౌతమి పైప్స్ ఫీడర్ల పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నాచారం ఐడీఏ సురి ఇంజినీరింగ్ రోడ్డు, రోడ్డు నెంబర్01, నుంచి 16 వరకు విద్యుత్ సరఫరా ఉండదని నాచారం ఏఈ ప్రకటించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి

మౌలాలి : కాలనీవాసులంతా కలిసికట్టుగా ఉంటూ శ్రామికనగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేద్దామని శ్రామికనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ అధ్యక్షుడు మహ్మద్ గౌస్ పిలుపునిచ్చారు. శనివారం కాలనీలోని హైడెన్ స్కూల్ శ్రామినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో పార్కుస్థలం అభివృద్ధితో పాటు కమ్యూనిటీహాల్ నిర్మాణం, స్ట్రీట్ లైట్స్ సూచికబోర్డుల ఏర్పాటు, మౌలిక వసతులు కల్పించుకుందామన్నారు. కమిటీ సభ్యులు అబ్దుల్ హమీద్, హేమంత్, కొంతం శ్రీనివాసరావు, మహ్మద్ ఇస్మాయిల్, అబ్దుల్ రహమాన్, శ్రీనివాసరావు, రాంరెడ్డి, అబ్దుల్ హమీద్, ఆజాద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ డాక్టర్లపై కేసు నమోదు

మల్కాజిగిరి: మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ మౌలాలి ప్రాంతంలో ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు నిర్వహిస్తున్న ఇద్దరు నకిలీ డాక్టర్లపై కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలి ఆర్టీసీ కాలనీ హనుమాన్‌నగర్‌లో శ్రావణి ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను బోడ వెంకటేశ్వర్లు, శ్రీకృప ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను జి.భాగ్యరేఖ గత కొన్ని రోజులుగా ఎంబీబీఎస్ డాక్టర్లుగా చలామణి చేస్తూ నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారి డాక్టర్ దండెం లాలయ్యకుమార్ ఆకస్మిక తనిఖీలు చేశారు. అధికారుల తనిఖీల్లో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. నిందితులపై మల్కాజిగిరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శానిటరీ ప్యాడ్ దహనయంత్రం అందజేత

అల్వాల్: పర్యావరణ పరిరక్షణకు హైదరాబాద్ యూత్ అసెంబ్లీ సంస్థ కృషి చేస్తుందని సంస్థ నిర్వాహకులు అన్నారు. శనివారం అల్వాల్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలకు శానిటరీ ప్యాడ్ దహన యంత్రాన్ని అందజేశారు. బహిరంగ ప్రదేశాల్లో పారవేయకుండా మిషన్లలో వేయాలన్నారు.

విద్యతో పాటు విలువలు నేర్పించాలి

కుషాయిగూడ: విద్యార్థులకు విద్యతో పాటుగా విలువలను కూడా నేర్పించాలని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి అన్నారు. చర్లపల్లి డివిజన్, చక్రిపురంలోని చక్రివిద్యానికేతన్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలను కార్పొరేటర్ బొంతు శ్రీదేవితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల అభిరుచులకు తగ్గట్టుగా ప్రోత్సహించినప్పుడే వారు లక్ష్యాలకు చేరువవుతారన్నారు.

మేకలమండిలో సమస్యలు పరిష్కరిస్తాం

బోడుప్పల్: చెంగిచర్లలోని మేకలమండిలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. చెంగిచర్ల స్లాటర్ హౌజ్‌లో శనివారం మండిలో మేకల రైతులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మేకలమండి కాంట్రాక్ట్ తీసుకున్న వ్యక్తి గడువు ముగియడంతో ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని, ఈ క్రమంలో మండినే నమ్ముకున్న కార్మికులు, మేకల రైతులు, కంటింగ్ వాలాలు ఆందోళన చెందుతున్నారన్నారు. దీనిపై సీఎం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, మాజీ మేయర్ అజయ్‌యాదవ్, బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు బింగి జంగయ్యయాదవ్, కొత్త చందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వజ్రేష్‌యాదవ్

పద్మశాలీలు నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలి

ఉప్పల్: పద్మశాలీలు చట్టసభలో నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. భక్త మార్కండేయ జయంతి సందర్భంగా ఉప్పల్ కొమ్మిడి కృష్ణారెడ్డి గార్డెన్‌లో శనివారం నిర్వహించిన పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పద్మశాలీల వైకుంఠ దామానికి స్థలం కేటాయించాలని కుల సంఘాల పెద్దలు ఎమ్మెల్యేను కోరడంతో స్పందించిన ఆయన ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, రాజకుమార్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సాయిజెన్ శేఖర్, చిలుకానగర్ పద్మశాలీ సంఘం నేతలు నాగరాజు, ప్రసాద్, శివ, బాలచందర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నీటి ఎద్దడిపై ముందస్తు చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్‌లో ప్రజలు నీటి ఎద్దడి ఎదుర్కోకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని కార్పొరేటర్ శ్రవణ్ జలమండలి అధికారులకు సూచించారు. శనివారం జలమండలి అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించిన కార్పొరేటర్ పలు సూచనలు చేశారు. పలు కాలనీల్లో పవర్‌బోర్ల మరమ్మతులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పూర్తిచేయాలని సూచించారు. నీటి ప్రెషర్ తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తగిన సామర్థ్యంలో సరఫరా జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నెరేడ్‌మెట్, ఓల్డ్ మల్కాజిగిరిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, కృపా కాంప్లెక్స్ వద్ద సీవరేజ్ కనెక్షన్ సమస్యను పరిష్కరించాలన్నారు. అధికారులు సిబ్బంది నవీన్, ధనుంజయ్, నాగార్జున, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్‌కు ఆత్మీయ సత్కారం



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ఐదేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా సాయిహిల్స్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు మధు, కార్యదర్శి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి కార్పొరేటర్‌ను సత్కరించారు. ప్రజ్వల ఆసుపత్రి ఎండీ విక్టర్ ఇమ్మాన్యుయేల్, సాయిహిల్స్, శ్రీసాయినగర్, విహారికా, క్రాంతి కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

రామంతాపూర్: వివేక్‌నగర్ శ్రీనివాసపురంలో ఓపెన్ డ్రైన్ నాలా పనులను కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ అధికారి నాగమణి, ఏఈ శ్వేతతో కలిసి శనివారం పర్యటించిన ఆమె పనుల జాప్యంపై ఆరా తీశారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె అధికారులకు సూచించారు. 15 రోజుల్లో పనులు పూర్తిచేయకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కుషాయిగూడ: హెచ్‌బీకాలనీ, మంగాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ 50వ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం త్రిదండి చినజీయర్ స్వామి చేతుల మీదుగా ఆలయ గోపురంపై సుదర్శన చక్ర ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో చినజీయర్ స్వామి భక్తులకు అనుగ్రహ బాషణం చేసి ఆలయ విశిష్టతను వివరించారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్, ఆలయ ఈవో రవీంద్రరెడ్డి, మాజీ కార్పొరేటర్లు శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, స్థానిక నేతలు రాంప్రదీప్, శ్రావణ్‌కుమార్‌గౌడ్, మురళీచారి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఆలయంపై సుదర్శన చక్రాన్ని ప్రతిష్ఠించిన చినజీయర్‌స్వామి

అలరించిన కూచిపూడి ప్రదర్శన

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. శనివారం సులోచన కళాక్షేత్రం గురువు వేముల రాధిక శిష్యబృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. దశావతారం, జావళి, బ్రహ్మాంజలి, లలిత హారతి, తిల్లాన, నర్తన తదితర అంశాలను రాధిక, విష్ణు ఆధ్య, వంశిక, అనన్య, తారని, అరుషి, చారిమ్మక, అక్షర, అవంతిక తదితరులు ప్రదర్శించి మెప్పించారు.



ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

స్థానిక సమస్యలపై జలమండలి ఎండీకి వినతి

హబ్సిగూడ: డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతనాహరీష్ శనివారం జీహెచ్‌ఎంసీ జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాంరెడ్డినగర్, సాయిచిత్రనగర్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. తాగునీటిలో మురుగునీరు కలిసి కలుషితం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన ఎండీ త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం.

వ్యక్తి అదృశ్యం

అల్వాల్: వ్యక్తి అదృశ్యమైన ఘటన నెరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెరేడ్‌మెట్ బాలాజీ కాలనీలో నివసించే సురేష్ వృత్తి రిత్యా ఎలక్ట్రిషన్. కాగా శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.